సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం । 26 । మార్చి । 2025

I



3న బలిజపల్లె గంగమ్మ జాతర

రాజంపేటలో బలిజపల్లె గంగమ్మ జాతరను ఏప్రిల్ 3న నిర్వహించేందుకు నిర్వాహకులు తీర్మానించారు. –IIలో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధ॥ (సా॥)	సహర్ గురు॥ (ఉ॥)
రాయచోటి :	6.31	4.55
రాజంపేట :	6.29	5.03
పీలేరు :	6.30	4.53
మదనపల్లె :	6.32	4.56

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.90	రూ.110
రెండోరకం	రూ.60	రూ.80



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 103 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	-	-
సీబీ	430	555



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 271.120 కిలోలు

న్యూస్‌రీల్

సంప్రదాయ దుస్తుల్లోనే పాల్గొనాలి

రాయచోటి టౌన్: రాయచోటి శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో హుండీ ఆదాయం లెక్కింపులో సంప్రదాయ దుస్తుల్లోనే పాల్గొనాలని ఈవో డీవీ రమణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు ప్రారంభం అవుతుందని ఆయన తెలిపారు. స్త్రీలు చీర, పురుషులు పంచె, షర్ట్ ధరించి రావాలన్నారు. పాల్గొనదలచిన వారు ముందుగా వచ్చి తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

స్వామి పాదాలు తాకనున్న సూర్య కిరణాలు

నేటి(బుధవారం) నుంచి ఈ నెల 31వ తేది వరకు ఉదయం 6 గంటల నుంచి 6–30 గంటల లోపు శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారి పాదాలను సూర్యకిరణాలు తాకనున్నాయని ఈవో తెలిపారు. శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారు దక్షసంహారనంతరం అవతార సమాప్తి చేసి.. అర్చనామూర్తిగా వెలసిన అవతార మూర్తిని సూర్యభగవానుడు సప్తద్వారాలు దాటి.. గర్భాలయంలోని స్వామి వారి పాదాలను తాకుతాయని తెలిపారు. సూర్య భగవానుడికి శివ జ్ఞానాన్ని ప్రసాదించిన శ్రీ వీరభద్రస్వామి పాదాలను.. దక్షప్రజాపతి సూర్యకిరణాల ద్వారా పాద పూజ చేసుకొంటారని, అందులో భాగంగానే ఈ సూర్యకిరణాలు ప్రసరిస్తాయనే భక్తుల ప్రగాఢ నమ్మకం అన్నారు.

ఇళ్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా హౌసింగ్ పీడీ సాంబశివయ్య

రాజంపేట: రాష్ట్ర ప్రభుత్వ అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరు చేస్తోందని, ఇందుకోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా హౌసింగ్ పీడీ సాంబశివయ్య తెలిపారు. స్థానిక మున్సిపాలిటీ మెప్మా కార్యాలయంలో మంగళవారం మెప్మా సిబ్బందితోపాటు మున్సిపల్ ఏఈలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇళ్లు మంజూరైన ఎస్సీ, ఎస్టీ, బీసీలు నిర్మించుకోలేక, అర్ధాంతరంగా ఆగిపోయి ఉంటే.. అటువంటి వారికి ప్రభుత్వం అదనంగా సాయం అందిస్తోందన్నారు. ఇందులో భాగంగా ఎస్టీలకు రూ.75 వేలు, ఎస్సీ, బీసీలకు రూ.50 వేల అందిస్తుందన్నారు. ఈ విషయంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. సొంత స్థలం ఉండి.. నిర్మించుకోదలిస్తే పక్కా ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. స్థలం లేని వారు స్థలం, ఇళ్లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈ ఈశ్వర్‌రెడ్డి, రాజంపేట హౌసింగ్ ఈఈ మురళీకృష్ణ, మెప్మా ప్రతినిధి అయ్యవారయ్య తదితరులు పాల్గొన్నారు.

కేసీ కెనాల్ నీటి విడుదలకు చర్యలు

కడప సెవెన్‌రోడ్స్: కేసీ కెనాల్ ఆయకట్టుకు ఏప్రిల్ 15వ తేది వరకు నీరు అవసరమని జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీలో కోరడంతో ఆ విషయాన్ని తాము ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లామని కేసీ కెనాల్ (స్పెషల్) సబ్ డివిజన్ మైదుకూరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎస్.పుల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు తగు చర్యలు తీసుకుంటామని వారు తెలిపారని వెల్లడించారు. ఈనెల 22న సాక్షి దినపత్రికలో 'ఇటు కేసీ చూడండి' అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. జిల్లాలోని కేసీ కాలువ పరిధిలో ఉన్న పంటలకు ఇప్పటివరకు నీరు అందిస్తూనే ఉన్నామని తెలిపారు.

క్రమశిక్షణ, సేవాభావానికి ప్రతీక స్కౌట్



మాట్లాడుతున్న ఉప విద్యాశాఖ అధికారి శివప్రకాష్‌రెడ్డి

రాయచోటి అర్బన్: విద్యార్థులు చిన్నప్పటి నుంచి క్రమశిక్షణతోపాటు దేశభక్తి, సామాజిక సేవాభావాలను పెంపొందించడానికి బాలభటుల ఉద్యమం (స్కౌట్ అండ్ గైడ్స్) ఎంతో తోడ్పడుతుందని ఉపవిద్యాశాఖ అధికారి శివప్రకాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో స్కౌట్ మాస్టర్లు, గైడ్‌కెప్టెన్‌లకు నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో స్కౌట్‌యూనిట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఇందులో ప్రవేశం పొందిన విద్యార్థుల వివరాలు మార్చి 31వ తేదీలోపు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, జిల్లా కోశాధికారి ఎం.ఓబులరెడ్డి, ఏఎస్‌టీసీ లక్ష్మీకర్, రీసోర్స్‌పర్సన్ గురుప్రసాద్‌రెడ్డి, రాజంపేట, రాయచోటి డివిజన్‌ల స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్‌లు, కబ్‌మాస్టర్స్, ఫ్లాక్‌లీడర్స్ తదితరులు పాల్గొన్నారు.

కన్నీటి దిగుబడి

సంబేపల్లె సమీపంలో పొలంలోనే వదిలేసిన దోస సంత





రైల్వేకోడూరు నియోజకవర్గంలో తోటలోనే వదిలేసిన కోహినూర్ దోస పంట

- కర్బూజ, దోస రైతు కుదేలు
- పెట్టుబడి కూడా రాని వైనం
- దోచుకుంటున్న దళారులు
- పట్టించుకోని ప్రభుత్వం
- అప్పుల పాలైన అన్నదాత

రాయచోటి/రైల్వేకోడూరు అర్బన్: జిల్లాలో దోస, కర్బూజ పంటలు పండించే రైతులకు ఫలితాలు.. ఈ ఏడాది కూడా ఆశాజనకంగా లేవు. నష్టేట ముంచి అప్పులపాలు చేస్తున్నాయి. ఫిబ్రవరి నెల ఆఖరులో, మార్చి మొదటి వారంలో దోస 22 రూపాయలు, కర్బూజ 18 రూపాయలు ధరలు పలకడంతో కొందరు రైతులు లాభపడ్డారు. దీంతో రైతులు కొండంత ఆశ పెట్టుకొన్నారు. కానీ అందరి దిగుబడి చేతికి వచ్చే సరికి.. దళారులు మోసాలతో ధరలను పాతాళానికి పడేశారు. జిల్లాలో భారీగా దోస, కర్బూజ పంటలు సాగు చేశారు. ముఖ్యంగా రైల్వేకోడూరు, రాజంపేట, రాయచోటి ప్రాంతాలలో వందలాది మంది రైతులు వేశారు. తెగుళ్లు, దళారీల మోసాలు, గిట్టుబాటు ధరలు లేక భారీగా నష్టపోతున్నారు. ఓబులవారిపల్లిలో కోహినూర్ దోస వేసి ఎగుమతులు లేక రూ.లక్షల్లో నష్టపోయారు.

ఎరువులు, పురుగు మందుల పిచికారీ కోసం..

దోస, కర్బూజ పంటల సాగు ప్రారంభ దశ నుంచే రైతులకు మందుల పిచికారీ, ఎరువులు పెనుభారంగా మారింది. విత్తన దశ నుంచి క్రిమి సంహారక మందులకు వేలాది రూపాయలు వెచ్చించాల్సి వస్తుంది. దీనికి తోడు పూతకు పిందెలు వచ్చే సమయం నుంచి తెగుళ్ల నివారణకు మందుల పిచికారీ అధికంగా ఉంటుంది. వాతావరణ మార్పుల వల్ల పూత రావడానికి, పిందె నిలవడానికి, తెగుళ్లకు రెండు రోజులకు ఒక సారి అయినా మందులు పిచికారీ చేయాలి. కేవలం మందులకే రైతులు దుకాణాల్లో రూ.లక్షలు అప్పులు చేశారు.



తూకాల్లో కోత

రైతులు పంటకు ధరలు పడి పోయి కన్నీరు కారుస్తుంటే.. పలువురు దళారీలు ఇదే అదునుగా మరింతగా రేటు తగ్గిస్తున్నారు. ఇక్కడి దిగుబడిని ఇతర రాష్ట్రాలకు కూడా తరలిస్తుంటారు. ఇదే అదునుగా రైతులకు, వ్యాపారులకు మధ్య దళారులు చేరి అక్కడ ఒకరేటు, రైతులకు ఒకరేటు, లోడ్ తూకాలలో కోత, కమీషన్‌లు ఇలా రకరాలుగా మోసం చేస్తున్నారు.

కరుణించని పాలకులు

మార్కెట్ ధరలు లేక అప్పుల ఊబిలో కూరుకుపోయిన దోస రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం.. ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. గిట్టుబాటు ధరలు రావడం లేదని

నియోజకవర్గం	దోస	కర్బూజ
రైల్వేకోడూరు	2210	1720
రాయచోటి	480	346
రాజంపేట	179	225
మదనపల్లి	125	56
పీలేరు	230	42
తంబళ్లపల్లి	708	–

జిల్లాలో దోస, కర్బూజ పంట సాగు వివరాలు (హెక్టార్లలో)

పెట్టుబడి కూడా రాలేదు



నా పేరు నిరంజన్‌రెడ్డి. మా ఊరు చిన్నమండెం మండలం రెడ్డివారిపల్లె. 20 ఎకరాల్లో దోస సాగు చేశా. పంట దిగుబడి వచ్చే వరకు 30 లక్షల రూపాయల వరకు ఖర్చు చేయాల్సి వచ్చింది. ఉద్యానవన అధికారుల సూచనలతో పురుగు నివారణ మందులు పిచికారీ చేశాను. ఎకరాకు నాలు గైదు టన్నులు వస్తుందని ఆనందపడ్డాను. ప్రకృతి కరుణించలేదు, తెగుళ్లు వీడలేదు. ఫలితంగా సగం తోట దెబ్బతిన్నది. వచ్చిన దిగుబడితోనైనా పెట్టుబడి వస్తుందని ఆశించాను. మార్కెట్‌కి వెళ్తే ధరలు లేక, పెట్టిన పెట్టుబడి రాక ఆర్థికంగా కుంగిపోయే పరిస్థితులు వచ్చాయి.

దళారీల సిండికేటుతో ఇక్కట్లు



నా పేరు ఎద్దుల ప్రసాద్. మాది రైల్వేకోడూరు. పది ఎకరాలలో కర్బూజా పంటను సాగు చేశా. దళారుల సిండికేట్ వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లాలోని వ్యాపారులు కాకుండా ఇతర ప్రాంతాలకు చెందిన వారు కూడా కలిసి వాట్సాప్ గ్రూపులలో దోస, కర్బూజా ధరలను పంచుకుంటున్నారు. ఒక వ్యాపారి తోట దగ్గరికి వచ్చి కిలో 5 రూపాయలతో కొనుగోలు చేస్తామని చెప్పి వెళ్లిన విషయాన్ని వాట్సాప్ గ్రూపుల ద్వారా రైతు పేరుతోపాటు గ్రూపులలో షేర్ చేస్తున్నారు. దీంతో మిగిలిన వ్యాపారులు అదే ధరకు లేదా మరో రూపాయి అదనంగా ఇస్తామని మాత్రమే చెబుతున్నారు.

ఇదీ ఈ ఇద్దరి రైతుల ఆవేదనే కాదు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి పరిస్థితి నెలకొంది.

అనుకూలించని రేటు



రైల్వేకోడూరు ప్రాంతంలో సాగు చేసిన కర్బూజ పంట

కష్టపడి పండించిన కర్బూజాకు మార్కెట్ ధర లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా కొంత మంది రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా దోస, పుచ్చకాయ పంటను సాగు చేశారు. మార్కెట్లో కేజీ దాదాపు రూ.15 నుంచి రూ.20 పలుకుతోంది. దళారులు కేజీ రూ.5 లేదా రూ.8 మాత్రమే చెల్లిస్తున్నారు. కానీ ఎకరాకు పెట్టుబడి 50 వేల నుంచి లక్ష రూపాయలకు పైగా అవుతుందని రైతులు పేర్కొంటున్నారు. దీంతో పంటపై పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పొలంలోనే కాయలను వదిలి వేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని వాపోతున్నారు.

రైతు సంఘాల నేతలు గళమెత్తి అరుస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదు. కనీసం జిల్లాలోని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు సైతం.. కష్టాల కడలిలో ఉన్న కర్షకులను పరామర్శ చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమ ప్రాంతం ఎమ్మెల్యేలు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని రైతులు కోరుతున్నారు.

రైతులను ఆదుకోవాలి



సంబేపల్లి మండలం రెడ్డివారిపల్లె పంచాయతీ సీఎం కొత్తపల్లిలో రైతు రామచంద్ర 4 ఎకరాలలో రూ.6 లక్షలు ఖర్చు చేసి సాగు చేశారు. దళారులు అడిగినంతకు కాయలు ఇవ్వలేదని వాటిని కొనుగోలు చేయలేదు. కాయలు తోటలోనే కుళ్లిపోవాల్సిన పరిస్థితి. పండించిన పంటను మార్కెట్‌కి తరలించలేక రైతు తోటలోనే కూలిపోయాడు. ఇలా వేల మంది రైతులు దోస, కర్బూజ తోటలను సాగు చేసి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. కావున ప్రభుత్వం వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

– బాలకృష్ణారెడ్డి, రైతు సంఘం రీజనల్ కోఆర్డినేటర్, అన్నమయ్య జిల్లా

ప్రజల ఆహారపు అలవాట్లలో మార్పు రావాలి



జిల్లాలో సాగవుతున్న పంటలో సగం ఒక పైగా రైతులు పండ్ల తోటలు వేస్తున్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని మంచి ఆదాయాన్ని గడించవచ్చని దోస పంట సాగు చేశారు. రైతులు పండించిన పంటకు మంచి గిట్టుబాటు ధరలు రావాలంటే ప్రజలు ఆహారపు అలవట్లను మార్చుకుంటే మంచిది. ప్రతి ఒక్కరూ ప్రతి రోజు మంచి ఆరోగ్యం కోసం ఆహారంలో 200 గ్రాములు పండ్లను తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది. జిల్లాలో పండించిన రైతుకు బాగుంటుంది.

– రవిచంద్రబాబు, జిల్లా ఉద్యానవన అధికారి, అన్నమయ్య జిల్లా

క్షయ వ్యాధిగ్రస్తులపై వివక్ష తగదు

రాయచోటి అర్బన్: క్షయ వ్యాధిగ్రస్తులపై ఎవరూ వివక్ష చూపరాదని జాతీయ మానవ హక్కుల కమిషన్ కన్వీనర్ డాక్టర్ ప్రదీప్ కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో వైద్య, ఆరోగ్యశాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, మానసిక ఆరోగ్యశాఖ, ఇతర శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం వర్చువల్‌గా రైల్వేకోడూరు జ్యోతికాలనీలో ఉన్న కుష్ఠు వ్యాధిగ్రస్తులతో మాట్లాడి వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మరింత మెరుగ్గా కుష్ఠువ్యాధి నివారణ కార్యక్రమం అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ దేవసాగర్, డీఎంహెచ్‌ఓ కొండయ్య, అదనపు డీఎంహెచ్‌ఓ శైలజ, జిల్లా న్యూక్లిప్ మెడికల్ ఆఫీసర్ విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ డాక్టర్ శివప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా అధికారులతో జాతీయ మానవ హక్కుల కమిషన్ కన్వీనర్ ప్రదీప్‌కుమార్

నేటి నుంచి అన్నమయ్య వర్ధంతి ఉత్సవాలు

- తాళ్లపాక వైపు కన్నెత్తి చూడని టీటీడీ అధికారులు
- చైర్మన్‌కు ఫిర్యాదు చేసిన తాళ్లపాక గ్రామస్తులు

రాజంపేట: పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు 522 వర్ధంతి ఉత్సవాలను బుధవారం నుంచి నిర్వహించనున్నారు. టీటీడీ ఏర్పాట్లు పూర్తి చేసింది. తాళ్లపాక, 108 అన్నమయ్య అడుగుల విగ్రహం వద్ద చలువ పందిళ్లు, స్వాగతతోరణాలు, కళాకారుల కోసం కళావేదికను సిద్ధం చేశారు. ఈ ఉత్సవాలు 29 వరకు కొనసాగనున్నాయి. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులచే ఆధ్యాత్మిక, సంగీత కార్యక్రమాలను నిర్వహించనున్నారు.



అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వద్ద స్వాగత తోరణాలు

తాళ్లపాకను అభివృద్ధి చేయాలి

అన్నమాచార్యులు జన్మస్థలి తాళ్లపాక వైపు టీటీడీ అధికారులు కన్నెత్తి చూడటం లేదని తాళ్లపాక గ్రామస్తులు అదృష్టదీపుడు, మోహనరావు, నారయణ, బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగోతు రమేష్‌నాయుడులు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు మంగళవారం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును కలిసి అన్నమయ్య జయంతి, వర్ధంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలవని వారు కోరారు. తిరుమలలో హుండీలో వచ్చిన ఆదాయం ఒక శాతం తాళ్లపాక అభివృద్ధి కోసం వ్యయం చేయాలన్నారు.

భక్తకన్నప్ప గ్రామం..
ప్రాచుర్యం శూన్యం



భక్తకన్నప్ప విగ్రహం

భక్తకన్నప్ప జన్మస్థలికి ఇప్పటి వరకు అధికార ముద్ర పడలేదు. కూటమి ప్రభుత్వం అయినా చొరవ చూపుతుందా అనే అంశం చర్చనీయాంశంగా మారింది. భక్తకన్నప్ప సినిమా తీస్తున్న మంచువిష్ణు బృందం సందర్శించిన క్రమంలో.. ఊటుకూరు మరోసారి తెరపైకి వచ్చింది.

- పెరియ పురాణం ద్వారా వెలుగులోకి జన్మస్థలి
- పట్టించుకోని ప్రభుత్వం
- కన్నెత్తి చూడని శ్రీకాళహస్తి దేవస్థానం
- భక్తుల ఆవేదన అరణ్య రోదన

రాజంపేట: భక్త కన్నప్ప గొప్ప శివభక్తుడు. తెలుగు వాడు. ఆయనను మొదట్లో తిన్నడు అనే పేరుతో పిలిచే వారు. బోయ వంశస్తుడు. ఒక బోయరాజు కుమారుడు.ఒకనాడు అడవిదారి గుండా వెళ్తుండగా.. శివలింగం కనిపించింది. అప్పటి నుంచి ఆ శివలింగాన్ని తిన్నడు భక్తి శ్రద్ధలతో పూజిస్తూ.. తాను వేటాడి తెచ్చిన మాంసాన్నే నైవేద్యంగా సమర్పించే వాడు. ఒక సారి శివుడు తిన్నడు భక్తిని పరీక్షించ దలచి.. ఆయన పూజ చేయడానికి వచ్చినపుడు శివలింగంలోని ఒక కంటి నుంచి రక్తం కార్చడం మొదలు పెట్టారు. విగ్రహం కంటిలో నుంచి నీరు కారడం భరించలేని తిన్నడు బాణపు మొనతో తన కంటిని తీసి విగ్రహానికి అమర్చాడు. వెంటనే విగ్రహం రెండో కంటి నుంచి కూడా రక్తం కారడం ఆరంభమైంది. కాలి బొటనవేలును గుర్తుగా ఉంచి తన రెండో కంటిని కూడా తీసి విగ్రహానికి అమర్చాడు. తిన్నడి నిష్కల్మష భక్తికి మెచ్చిన శివుడు అతనికి ముక్తిని ప్రసాదించారు. నిన్ను దర్శించినా, చరిత్ర విన్నా.. పఠించినా సర్వపాపాలు తొలిగి.. అంత్యకాలంలో కైలాసప్రాప్తి పొందుతారని పలికి పరమశివుడు అంతర్ధానమయ్యారు. అందువల్లనే తిన్నడికి.. కన్నప్ప అనే పేరు వచ్చింది. తిన్నడు దేవుడికి కన్ను ఇచ్చినందుకే కన్నప్ప అయ్యారు. ఆయన భక్తిని మెచ్చిన ప్రజలు.. భక్తకన్నప్పగా పిలుస్తున్నారు. ఆ శివలింగం ఉన్న ప్రాంతంలోనే శ్రీ కాళహస్తి క్షేత్రం వెలసినట్లు చరిత్ర చెబుతోంది.



ఊటుకూరులో కన్నప్ప ప్రతిష్ఠించిన శివలింగం ఉండే శివాలయం ఇదే

కన్నప్ప పుట్టిన ఊరు ఎక్కడా..

రాజంపేట పట్టణం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో కడప–రేణిగుంట జాతీయ రహదరిలో భక్తకన్నప్ప జన్మస్థలం అయిన ఊటుకూరు ఉంది. హైవే రోడ్డు పక్కనే కన్నప్ప ప్రతిష్ఠించిన శివలింగం ఉన్న పురాతన ఆలయం ఉంది. తిరుపతి, చెన్నైకు వెళ్లే ఏ వాహనంలో అయినా ఊటుకూరు (ఉడుమూరు)కు చేరుకోవచ్చు.

వెలుగులోకి తీసుకొచ్చిన తమిళ వాసి..

తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన పళనిస్వామి పెరియపురాణం ద్వారా భక్తకన్నప్ప జన్మస్థలం.. అన్నమయ్య జిల్లాలోని రాజంపేట మండలం ఊటుకూరు అని వెలుగులోకి తీసుకొచ్చిన సంగతి విదితమే. అప్పటి నుంచి గ్రామస్తులు దాతల సహకారంతో.. గ్రామంలోని శివాలయం అభివృద్ధికి నడుంబిగించారు. భక్తకన్నప్ప విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.



ఊటుకూరు శివాలయంలోని నాగలింగేశ్వరస్వామికి పూజలు చేస్తున్న హీరో మంచు విష్ణు (ఫైల్)

అధికారిక గుర్తింపు కోసం ఎదురు చూపులు

భక్తకన్నప్ప జన్మస్థలం అధికారిక గుర్తింపు కోసం ఎదురు చూస్తోంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం నుంచి అనమతులు ఎప్పుడు వస్తాయని ఇక్కడి ప్రాంతీయులు వేచి చూస్తున్నారు. భక్తకన్నప్ప జన్మస్థలం అభివృద్ధికి సహకరించాలని గతంలో శ్రీకాళహస్తి దేవస్థానం దృష్టికి వారు తీసుకెళ్లారు.

కన్నప్ప జన్మస్థలం ఇలా..

అరవై ముగ్గురు మహాశివభక్తులలో కన్నప్ప ఒకరు. తండ్రి నాగుడు, తల్లి తంచె. కన్నప్ప ద్వాపరయుగంలో అర్జునడే. ఆ యుగంలో శివుని అనుగ్రహం కోసం తపస్సు చేసి.. పాశుపాతాస్త్రం పొందారు. కలియుగంలో తిన్నడు (కన్నప్ప)గా ఉడుమూరులో జన్మించారు. కాలక్రమంలో ఉడుమూరు ఊటుకూరుగా మారింది. కన్నప్ప ప్రతిష్ఠించిన శివలింగం.. తన జన్మస్థలమైన ఊటుకూరులో ఉంది. అక్కడ శివాలయం వెలసింది.

అన్నమయ్యతో కన్నప్ప జన్మస్థలానికి అనుబంధం



తాళ్లపాక అన్నమాచార్యులు తాత నారాయణయ్య చదువుకోవడానికి ఊటుకూరు(ఉడుమూరు)కు వచ్చారు. చదువు అబ్బక గురువు పెట్టే శిక్షలు భరించలేక చింతాలమ్మ గుడిలోని పుట్టలో చేయిపెట్టారు. పాము కరవలేదు కానీ, చింతాలమ్మ ప్రత్యక్షమైంది. 'శ్రీ వెంకటేశ్వరుని అనుగ్రహం వల్ల పరమభక్తుడు నీకు మనవునిగా పుడతారు' అని ఆశీర్వదించింది. ఆ నారాయణయ్య మనువడే అన్నమాచార్యులు. అన్నమయ్య తండ్రి నారాయణసూరి, తల్లి లక్కమాంబ. అన్నమయ్య కూడా ఊటుకూరులో చిన్నతనంలో విద్యాభాస్యం చేశాడు. కలియుగ దైవం వెంకటేశ్వరునిపై 32 వేల కీర్తనలు రచించి, పద కవితా పితామహుడుపేరు తెచ్చుకొని ధన్యుడయ్యారు. చింతాలమ్మ అమ్మవారి విగ్రహం ఇప్పటికీ ఊటుకూరు శివాలయంలో ఉంది.

కన్నప్ప.. కాళహస్తికి ఎలా వెళ్లాడు

తిన్నడు(కన్నప్ప) ఒకనాడు అడవిలో పందిని వేటాడుతూ ఊటుకూరు నుంచి అటవీ ప్రాంతంలో స్వర్ణముఖినది వరకు వెళ్లాడు. అక్కడ నేటి శ్రీకాళహస్తి దగ్గర శివలింగాన్ని దర్శించి, శివుని భక్తునిగా మారారు. తర్వాత తన రెండు కళ్లను సమర్పించి భక్తిని చాటుకున్నారు. ఆనాటి నుంచి శ్రీకాళహస్తిలో భక్తకన్నప్పకు.. స్వామివారి కన్న ముందే పూజ చేయడం ఆచారంగా వస్తోంది. ఏటా స్వామి వారి బ్రహ్మోత్సవాల సమయంలోనూ.. భక్తకన్నప్ప కొండపై తొలుత ధ్వజారోహణం చేసిన తర్వాత మరుసటి రోజు స్వామివారి ధ్వజారోహణ చేసి ఉత్సవాలు ప్రారంభిస్తారు.



భక్తకన్నప్ప నడయాడిన ప్రదేశం



గ్రామంలో కన్నప్ప పూజించిన శివాలయం ఉంది. అలాగే ఊటుకూరు పరిసరాలు కన్నప్ప నడయాడిన ప్రాంతాలు. భక్తకన్నప్పకు శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాల్లో తొలిపూజ అనే సంప్రదాయం తరతరాలుగా వస్తోంది.

–నాగా పృథ్వీపతిరెడ్డి, గ్రామపెద్ద, ఊటుకూరు

చారిత్రక ఆధారాలు ఉన్నాయి



కన్నప్ప ఇక్కడి వాడేనని అన్ని చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఇక్కడి నుంచి శ్రీకాళహస్తికి అటవీ మార్గంలో చేరుకున్నారు. శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాల్లో తొలిపూజ మా గ్రామానికి చెందిన భక్తకన్నప్పకు అంటే మాలో ఎక్కడ లేని భక్తి ఉప్పొంగి వస్తుంది.

–ఆర్.శ్రీనువాసురాజు, ఎంపీటీసీ, ఊటుకూరు

క్లుప్తంగా

భూ వివాదంలో ఐదుగురిపై కేసు నమోదు

సుండుపల్లె : రాతికూసాలను, ఇనుప తంతిని ధ్వంసం చేసిన ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ముత్యాల శ్రీనివాసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. మండల కేంద్రానికి సమీపంలోని బుర్రలదిన్నె పల్లె గ్రామంలో కామిని శ్రీను అనే వ్యక్తి మామిడి తోటకు పొలానికి చుట్టుపక్కల రాతి కూసాలను ఏర్పరచుకుని ఇనుప తంతిని నిర్మించుకున్నాడు. అతనికి బంధువు అయిన కామిని అంజనమ్మ మరో నలుగురు వ్యక్తులు అతని పొలంలోకి అక్రమంగా ప్రవేశించి సుమారు 40 రాతి కూసాలను, ఇనుప తంతిని ధ్వంసం చేసి నష్టం చేకూర్చారు. కామిని శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ముత్యాల శ్రీనివాసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు భవన నిర్మాణ కార్మికుడి మృతి



మృతి చెందిన మల్లికార్జున

రాజంపేట : పట్టణంలోని ఆర్‌ఎస్ రోడ్‌లోని రాఘవేంద్ర ప్రావిజెనల్స్ సమీపంలో నిర్మాణంలో ఉన్న భవనం పై నుంచి ముద్దా మల్లికార్జున (35) అనే భవన నిర్మాణ కార్మికుడు కిందపడి మృతి చెందాడు. ఈ మేరకు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా కూలి పనుల నిమిత్తం ఒంగోలు నుంచి వచ్చిన భవన నిర్మాణ కూలీల బృందంలో ఇతను ఒకడిగా గుర్తించారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

మదనపల్లె : ఇంటి ముందు ముగ్గువేస్తున్న మహిళ మెడలో గుర్తు తెలియని వ్యక్తి బలవంతంగా గొలుసు చోరీ చేసిన ఘటన మంగళవారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని జోగప్పగారివీధికి చెందిన నాగభూషణం భార్య వెంకటలక్షుమ్మ(67) తెల్లవారుజామున 5 గంటల సమయంలో ఇంటి ముందు ముగ్గు వేస్తుండగా, గుర్తు తెలియని వ్యక్తి ముసుగు ధరించి వచ్చి మహిళ మెడలో నుంచి బలవంతంగా చైను లాక్కుని పరారయ్యాడు. చోరీ ఘటనపై బాధితురాలు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బంగారు గొలుసు సుమారు 12 గ్రాములు బరువుతో పాటు రూ.60వేలు విలువ చేస్తుందని ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు.

రోడ్డుపై మోల్డింగ్ వాహనం బోల్తా

– ఒడిస్సా వాసి దుర్మరణం





బోల్తాపడిన వాహనం, మృతుడు సింహాచలం

బి.కొత్తకోట : కర్ణాటకలోని రాయల్పాడులో ఓ ఇంటికి మోల్డింగ్ పనికోసం వెళ్తున్న వాహనం మార్గమధ్యంలో బి.కొత్తకోట మండలంలో బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న కూలీల్లో ఒకరు ఘటనా స్థలంలోనే దుర్మరణం చెందారు. పోలీసుల కథనం మేరకు వివరాలు.. మంగళవారం బి.కొత్తకోట నుంచి ఆరుగురు కూలీలతో రాయల్పాడులో మోల్డింగ్ పనుల కోసం వాహనం బయలుదేరింది. దాని వెనుక మిల్లర్‌ను తగిలించుకుని వెళ్తుండగా మొటుకుపల్లె పంచాయతీ టీకులపెంటకు సమీపంలోని దొక్కలవంక వద్ద వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఒడిస్సా రాష్ట్రానికి చెందిన కె.సింహాచలం (40) తీవ్ర గాయాలతో దుర్మరణం చెందాడు. మిగిలిన కూలీలకు రక్త గాయాలయ్యాయి. ఈ ఘటనపై స్థానిక కరెంట్ కాలనీలో ఉంటున్న మృతుని భార్య ఊర్మిల డ్రైవర్ శ్రీనివాసులు అజాగ్రత్తగా వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగి తన భర్త మృతి చెందాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ జీవన్ గంగనాథ్‌బాబు తెలిపారు.

దంపతుల మృతికి కారకుడిని
ఎలా వదిలేస్తారు?



గ్రామస్తులకు మద్దతు ప్రకటిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సుధీర్‌రెడ్డి



నిరసనకారులతో నిండిపోయిన కలమల్ల స్టేషన్ ఆవరణం

- రోడ్డు ప్రమాదం ఘటనలో నిందితుడిని విడిపించుకుని వెళ్లిన కూటమి నాయకుడు
- కలమల్ల ఎస్‌ఐ తీరుపై గ్రామస్తుల మండిపాటు
- పోలీసు స్టేషన్ వద్ద బైఠాయించి నిరసన
- గ్రామస్తులకు మద్దతు ప్రకటించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : దంపతుల మృతికి కారణమైన ఓమ్నీ వాహన డ్రైవర్‌ను పోలీసులు వదిలి పెట్టడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పెద్ద ఎత్తున గ్రామస్తులు కలమల్ల పోలీసు స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. వివరాలు ఇలా.. కలమల్ల గ్రామ సమీపంలో సోమవారం సాయంత్రం ఓమ్నీ వాహనం ఢీకొన్న సంఘటనలో వెంకటరాజారెడ్డి అనే ఆర్టీపీపీ కాంట్రాక్టు కార్మికుడు దుర్మరణం చెందగా అతని భార్య సుజాత తీవ్ర గాయాలతో కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ప్రమాదానికి కారణమైన ఓమ్నీ వాహన డ్రైవర్ వెంకటరమణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే రాత్రికి రాత్రే నిందితుడిని కూటమి పార్టీకి చెందిన ఆర్టీపీపీ ఉద్యోగి నారాయణస్వామి వచ్చి స్టేషన్ నుంచి విడిపించుకుని తీసుకెళ్లారు. ఇద్దరి మృతికి కారణమైన వాహన డ్రైవర్‌ను కలమల్ల ఎస్‌ఐ తిమోతి కూటమి నాయకుడి వెంట పంపించడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ మంగళవారం కలమల్ల పోలీసు స్టేషన్ ఎదుట బైఠాయించారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని ఎస్‌ఐను కోరితే ఆయన తమను బెదిరించాడంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఎస్‌ఐ తీరు ముందు నుంచి వివాదాస్పదంగా ఉందని, ఎవరు డబ్బులు ఇస్తే వారికి ఎస్‌ఐ వత్తాసు పలుకుతాడని ఆరోపించారు. గ్రామస్తులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి పోలీసు స్టేషన్ వద్దకు చేరుకుని గ్రామస్తులకు సంఘీభావం ప్రకటించారు. నిందితుడిని ఎలా వదిలేస్తారంటూ ఆయన మండిపడ్డారు. మృతుల కుటుంబానికి న్యాయం జరగకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న దంపతుల మృతదేహాలను సందర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మాకు న్యాయం చేయండి..

తల్లిదండ్రులను పోగొట్టుకున్న ఇద్దరు కుమార్తెలు తీవ్ర వేదనతో స్టేషన్ బయట బైఠాయించారు. తమకు న్యాయం చేయండి అంటూ బోరున విలపించారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలిన తమకు దిక్కు ఎవరు అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. ఒకానొక దశలో గ్రామస్తులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేయడంతో స్టేషన్ ఆవరణంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. నిందితుడు వెంకటరమణ, అతన్ని విడిపించుకుని వెళ్లిన ఆర్టీపీపీ ఉద్యోగి నారాయణస్వామిపై చర్యలు తీసుకోవాలని మృతుల సమీప బంధువు లింగారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిమోతి తెలిపారు.

కలమల్లకు చేరుకున్న పోలీసు బలగాలు..

ఎస్‌ఐ తీరును నిరసిస్తూ కలమల్ల గ్రామస్తులు స్టేషన్ బయట బైఠాయించడంతో ఎస్‌ఐ తిమోతి స్టేషన్‌లోనే ఉండిపోయారు. వెంటనే కొండాపురం ప్రొద్దుటూరు, జమ్మలమడుగు నుంచి సీఐలు మహమ్మద్ రఫీ, లింగప్ప, నరేష్‌బాబు, గోవింద రెడ్డి, గోపాల్‌రెడ్డి, దస్తగిరిలు, ఎస్‌ఐలు విద్యాసాగర్, ధనుంజయుడు, హృషికేశవరెడ్డి, పోలీసు సిబ్బంది స్టేషన్ వద్దకు చేరుకున్నారు. పరిస్థితి అదుపు చేసేందుకు ప్రయత్నించారు. తర్వాత జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వర్లు కూడా స్టేషన్‌కు వచ్చి పరిస్థితిని సమీక్షించారు.

ఏప్రిల్ 3న బలిజపల్లె గంగమ్మ జాతర



బలిజపల్లెలో స్వయంభుగా వెలసిన గంగమ్మ

రాజంపేట టౌన్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ఎంతో ప్రసిద్ధి గాంచిన బలిజపల్లె గంగమ్మ జాతరను ఏప్రిల్ 3వ తేదీ నిర్వహించేందుకు నిర్వాహకులు తీర్మానించారు. ఈమేరకు సోమవారం రాత్రి తొలుత బలిజపల్లెకు చెందిన జాతర నిర్వాహకులు బలిజపల్లెలో సమావేశమై జాతర తేదీని ఖరారు చేశారు. అనంతరం జాతర నిర్వహణలో భాగస్వాములైన తుమ్మలఅగ్రహారం, నారపురెడ్డిపల్లె జాతర నిర్వాహకులతో వారి గ్రామాల్లో సమావేశమై జాతర విషయమై చర్చించి ఏప్రిల్ మూడవ తేదీ జాతర నిర్వహించాలని మూడు గ్రామాలకు చెందిన నిర్వాహకులు తీర్మానించడంతో జాతర తేదీ అధికారికంగా ఖరారైంది. కాగా ఈనెల 30వ తేదీ రాత్రి బలిజపల్లె గ్రామంలో వెలసిన గంగమ్మ స్వయంభు వద్ద జాతర నిర్వహణకు వైభవంగా అంకురార్పణ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శివరాత్రి ముగిసినప్పటి నుంచి జాతర ఎప్పుడు నిర్వహిస్తారా అని ఎదురు చూస్తూ వచ్చిన భక్తులు జాతర తేదీ ఖరారు కావడంతో ఆనందం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి



టిప్పర్ డ్రైవర్ కోర్న సూర్యనారాయణ

చింతకొమ్మదిన్నె : కడప–చిత్తూరు జాతీయ రహదారిపై మండల పరిధిలోని మద్దిమడుగు బిడికి గ్రామ సమీపంలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మేకల ఆదినారాయణ, కోర్న సూర్యనారాయణ అనే వ్యక్తులు మృతి చెందినట్లు చింతకొమ్మదిన్నె సీఐ శివశంకర్ నాయక్ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం తెల్లవారుజామున రాయచోటి నుంచి కడపకు రాతి స్తంభాలు వేసుకుని ఏపీ04 బీఎక్స్7660 నెంబర్ గల ట్రాక్టరులో డ్రైవర్ వెంకట చలపతి, సహాయకుడు మేకల ఆదినారాయణ వస్తుండగా మద్దిమడుగు సుగాలి బిడికి గ్రామ సమీపంలో ఉదయం 5.45 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా ట్రాక్టర్ ట్రాలీ వెనుక ఎడమవైపు గల టైరు పేలి ట్రాక్టర్ అదుపు తప్పింది. ఈ ఘటనతో ట్రాక్టర్ ఒక్కసారిగా వేగం తగ్గడంతో వెనుక ఏపీ05 టీడీ 6549 నెంబరుగల కంకర లోడుతో వస్తున్న టిప్పర్ డ్రైవర్ వేగాన్ని అదుపు చేసుకోలేక ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో గాయపడిన ట్రాక్టర్ డ్రైవర్ వెంకట చలపతి, టిప్పర్ డ్రైవర్ కోర్న సూర్యనారాయణ, ట్రాక్టర్ సహాయకుడు ఆదినారాయణను రోడ్డు పక్కకు తీసుకెళ్లి నీరు తాగిస్తుండగా కొద్దిసేపటికే ఎన్‌ఎల్02 బి 7879 నెంబరుగల శివాజీ ట్రావెల్స్ ప్రైవేటు బస్సు డ్రైవర్ తురక శివరామకృష్ణ కడప నుంచి రాయచోటి వైపు అతివేగంగా నడుపుకుంటూ వచ్చి టిప్పర్ డ్రైవర్ కోన సూర్యనారాయణను ఢీకొట్టాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ట్రాక్టర్‌లోని సహాయకుడు, టిప్పర్ డ్రైవర్‌ను రిమ్స్‌కు తరలించారు. ఉదయం 7.36 గంటలకు ట్రాక్టర్ సహాయకుడు మేకల ఆదినారాయణ, ఉదయం 9.11 గంటలకు టిప్పర్ డ్రైవర్ కోర్న సూర్యనారాయణ మృతి చెందారు. ఈ ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసినట్లు చింతకొమ్మదిన్నె సీఐ తెలిపారు.

బేకరీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్



షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన సామగ్రి

వేంపల్లె : స్థానిక వేంపల్లె నాలుగు రోడ్ల కూడలిలోని కడప రోడ్డులో ఉన్న బెంగళూరు బేకరీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. దీంతో స్వీట్లకు సంబంధించిన మెటీరియల్, మిషనరీ దగ్ధమైంది. సంతోష్ కుమార్ అనే వ్యక్తి బతుకు దెరువు కోసం వృషభాచలేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన వాణిజ్య గదుల్లో బెంగళూరు బేకరీని నిర్వహిస్తున్నారు. రోజూ లాగే షాపునకు బీగాలు వేసి ఇంటికి వెళ్లారు. అయితే మంగళవారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో బేకరీలో నుంచి దట్టమైన పొగలు రావడంతో సమీపంలో ఉన్న దుకాణదారుడు నాగ సుబ్బారావు చూసి బేకరీ యాజమాని సంతోష్ కుమార్ కు సమాచారమిచ్చారు. అలాగే అగ్నిమాపక శాఖకు ఫోన్ ద్వారా సమాచారమివ్వడంతో హుటాహుటిన అగ్నిమాపక శాఖాధికారి శివరామిరెడ్డి సంఘటన స్థలం వద్దకు తన సిబ్బందితో చేరుకుని మంటలను అదుపు చేశారు. బేకరీలోనే స్వీట్లు తయారీ చేస్తుండడంతో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వచ్చినట్లు ఫైర్ అధికారి తెలిపారు. అగ్ని ప్రమాదం కారణంగా దాదాపు రూ.6 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

అనుమానంతో భార్యను హతమార్చిన భర్త



సుజాత మృతదేహం



చెన్న కేశవ మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ

- ఆపై తానూ ఆత్మహత్య
- వైఎస్సార్ జిల్లాలో ఘటన



సుజాత (ఫైల్)



చెన్న కేశవ (ఫైల్)

వల్లూరు : మద్యం మత్తులో అనుమానంతో భర్తే భార్యను హత్య చేసి ఆపై తాను కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వల్లూరు మండల పరిధిలోని అంబవరం ఎస్సీ కాలనీలో మంగళవారం జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు..అంబవరం ఎస్సీ కాలనీలో యర్రగుడిపాడుకు చెందిన చెన్న కేశవ, సుజాత దంపతులు నివసిస్తున్నారు. వీరికి సంతోష్ కుమార్ అనే వివాహమైన కుమారుడితో బాటు వరుణ్ కుమార్ (13) అనే కుమారుడు, స్వర్ణలత (8) అనే కుమార్తె ఉంది. చెన్న కేశవ (45) తాగుడుకు బానిసగా మారి మద్యం మత్తులో భార్య సుజాత (40)ను వేధిస్తుండేవాడు. సుజాతపై చెన్నకేశవ అనుమానం పెంచుకోవడంతో ఆమె 2 నెలల క్రితం తన పుట్టింటికి వెళ్లిపోయింది. నెల క్రితం ఆమె పెద్ద కుమారుని వివాహం జరగడంతో దాని కోసం ఆమె అంబవరం వచ్చింది. వివాహం జరిగిన తరువాత మళ్లీ తన అమ్మగారి ఇంటికి వెళ్లిపోయింది. కొడుకు అత్తగారి ఇంటి నుంచి కోడలికి ఉగాది సాంగ్యం తెస్తుండటంతో..తన కుమారుడు ఆమెను అంబవరానికి తీసుకువచ్చాడు. మంగళవారం మద్యం తాగిన చెన్న కేశవ ఇంటి ఆవరణలో సుజాతపై కొడవలితో దాడి చేయడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. చెన్న కేశవ కొడవలి పట్టుకుని క్రిష్టాపురం, గంగాయపల్లె రైల్వేస్టేషన్ల మధ్య నల్లపురెడ్డిపల్లె రైల్వే గేటుకు కొద్ది దూరంలో గూడ్సు రైలు కింద ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

28న ఆర్ట్స్ కాలేజీలో జాబ్ మేళా

ప్రొద్దుటూరు: ఈ నెల 28వ తేదీన జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యాన స్థానిక ఎస్‌సీఎస్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ(ఆర్ట్స్‌కాలేజీ)లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ జి.చంద్రశేఖర్, జేకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ టి.శశికాంత్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కడప కొప్పర్తిలోని ఏఐఎల్ డిక్సన్ టెక్నాలజీ ప్రైవేట్ కంపెనీలో అసెంబ్లింగ్ ఆపరేటర్, హెల్పర్, టెక్నీషియన్ ఉద్యోగాలకు ఎంపిక చేసేందుకు ఈ మేళా నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఇంటర్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ/డిప్లొమా, బీటెక్ (ఈసీఈ, ఈఈఈ) చదివిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల వారు 28న ఉదయం 9 గంటలకు జాబ్ మేళాలో పాల్గొనాలని, మరిన్ని వివరాలకు 9573321678 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

మధ్యవర్తిత్వంపై శిక్షణ

కడప అర్బన్ : జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్‌లు కడప న్యాయ సేవా సదన్‌లో మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేరళ రీసోర్స్ పర్సన్ పీజీ సురేష్ మాట్లాడుతూ న్యాయవాదుల పాత్ర, మధ్యవర్తిత్వం, రాజీ నియమాలు, కమ్యూనికేషన్ నిర్వచనం, ప్రక్రియ, ప్రభావవంతమైన, సమర్థమైన కమ్యూనికేషన్, ప్రయోజనాలు కమ్యూనికేషన్ రకాలు, కమ్యూనికేషన్ పద్ధతులు, మౌఖిక కమ్యూనికేషన్, బాడీ లాంగ్వేజ్ ప్రశ్నలు, తటస్థతతో సానుభూతి, రోల్ ప్లే–4 మొదలగు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్ జి జ్యోతి, న్యాయవాదులు పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాను గంజాయి రహిత జిల్లాగా రూపొందించడమే లక్ష్యంగా విశాఖ పట్నం, విజయవాడ నుంచి కడపకు వచ్చే రైళ్లు, బస్సులు, పార్సిల్ కేంద్రాల్లో పోలీస్ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మంగళవారం ఉదయం విశాఖపట్నం నుండి కడపకు చేరుకున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలులో తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికుల లగేజీని పరిశీలించారు. అనంతరం నగరంలోని బస్టాండు, సెవెన్ రోడ్స్ వద్ద ఉన్న ప్రైవేట్ ట్రావెల్స్ కార్యాలయాలలో, పార్సిల్ సెంటర్లు, గోడౌన్‌లలో తెల్లవారుజామున విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. గంజాయి రవాణాకు పాల్పడినా, సహకరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో ఫ్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి, జీఆర్‌పీ ఎస్‌ఐ సునీల్ కుమార్ రెడ్డి, ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ నాగభూషణం, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్‌పై దాడి చేసి.. కారును దొంగిలించారు

- ఇద్దరి అరెస్టు.. నిందితుల్లో ఒకరు మైనర్
- పరారీలో ఇరువురు ప్రధాన నిందితులు
- వివరాలు వెల్లడించిన కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు



అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు

కడప అర్బన్ : హైదరాబాదు నుంచి కడపకు ఇన్నోవా కారును బాడుగకు తీసుకుని వచ్చి డ్రైవర్‌పై దాడి చేసి.. కారును దొంగిలించిన కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో మైనర్ బాలుడు ఉన్నాడు. మంగళవారం కడప డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు చిన్న చౌక్ సీఐ ఓబులేసు, ఎస్‌ఐలు రాజరాజేశ్వర్ రెడ్డి, రవికుమార్‌లతో కలిసి కేసు వివరాలను వెల్లడించారు. కడపకు చెందిన నూరుల్లా అలియాస్ నూర్, తాజుద్దీన్ అలియాస్ తాజ్ హైదరాబాదుకు వెళ్లి ఈనెల 15న రాత్రి ఇన్నోవా కారును కడపకు బాడుగకు మాట్లాడుకొని వచ్చారు. ఈనెల 16వ తేదీన కడప రింగ్ రోడ్డు వద్దకు రాగానే కారు డ్రైవర్‌పై దాడి చేసి అతని మెడలోని బంగారు గొలుసు, వెండి ఉంగరాలను దోచుకుని కారుతో నిందితులు పరారయ్యారు. కారు డ్రైవర్ శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కడప చిన్నచౌక్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల దర్యాప్తులో కడపకు చెందిన పఠాన్ మర్ఫాద్ ఖాన్ అలియాస్ హోంవర్కర్ అలియాస్ లడ్డు మరో బాల నేరస్తునితో కలిసి డ్రైవర్ శ్రీకాంత్‌ను కొట్టి అతని వద్ద నుంచి రెండు సెల్ ఫోన్లు, మెడలో ఉన్న బంగారు గొలుసు, వెండి ఉంగరాలు తీసుకొని కారుతో పరారైనట్లు గుర్తించారు. జిల్లా ఎస్పీ ఈ.జీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు సీఐ ఓబులేసు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిందితులపై నిఘా ఉంచారు. వాటర్ గండి రోడ్డులో కడప నకాష్‌కు చెందిన పఠాన్ మర్ఫాద్ ఖాన్ అలియాస్ హోంవర్కర్ అలియాస్ లడ్డును అరెస్ట్ చేశారు. మరో మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి ఇన్నోవా కారును స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితులు నూరుల్లా అలియాస్ నూర్, తాజుద్దీన్ అలియాస్ తాజ్‌లు పరారీలో ఉన్నారు. వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ మేరకు ఒకరిని రిమాండ్‌కు తరలించారు. మరొకరిని పరిశీలనకు పంపించారు.

కారు ఢీకొని
యువకుడికి తీవ్ర గాయాలు

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులోని నాలుగు రోడ్ల కూడలిలో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కేతిరెడ్డి నాగ యశ్వంత్ రెడ్డి అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం దిగువపల్లెకు చెందిన రాధాకృష్ణారెడ్డి కుమారుడు నాగ యశ్వంత్‌రెడ్డి మండలంలోని పల్లవోలు వద్ద గల సీబీఐటీ కాలేజీలో డిప్లమో చదువుతున్నాడు. ఈ క్రమంలో నాగ యశ్వంత్‌రెడ్డి మంగళవా రం ప్రొద్దుటూరు నుంచి చాపాడు కు వచ్చి కూడలిలో యూటర్న్ తీసుకుంటుండగా మైదుకూరు వైపు నుంచి వస్తున్న కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాగ యశ్వంత్‌రెడ్డిని చాపాడు ట్రైనీ డీఎస్పీ భవానీ, ఎస్‌ఐ చిన్న పెద్దయ్య 108లో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

తిరువణ్ణామలై వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం

– కోడూరు వాసి మృతి



నరసింహారెడ్డి(ఫైల్)

రైల్వేకోడూరు అర్బన్ : తమిళనాడులోని తిరువణ్ణామలై పుణ్యక్షేత్రానికి వెళ్లి శివుడి దర్శనం చేసుకొని తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో కోడూరు వాసి మృతి చెందాడు. దర్శనం అనంతరం స్నేహితులతో కారులో వస్తుండగా చిత్తూరు జిల్లా పాకాల వద్ద మంగళవారం కారు డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కోడూరు మండలం రాఘవరాజపురం (సత్రం)కు చెందిన కౌలురైతు వెలిగిచెర్ల నరసింహారెడ్డి (45) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య రజని, కొడుకు ఈశ్వర్, 5 నెలల పాప ఉంది. తమిళనాడు పోలీసులు కేసు నమోదు చేశారు.

పది ప్రశ్నపత్రం లీకేజీపై విచారణ

సాక్షిటాస్క్‌ఫోర్స్ : వల్లూరు జెడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రం నుంచి సోమవారం పదో తరగతి గణితం ప్రశ్నపత్రం లీకేజీ ఘటనపై విచారణ కొనసాగుతోంది. కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో, కమలాపురం సీఐ ఎస్‌కే రోషన్, ఎస్‌ఐ ప్రతాప్ రెడ్డిల నేతృత్వంలో సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం రాత్రి వరకు అత్యంత రహస్యంగా విచారణ జరిపారు. ఇప్పటికే వల్లూరు జెడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రంలోని చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంట్ అధికారితోపాటు ఇన్విజిలేటర్‌ను సస్పెండ్ చేసినట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. పరీక్షా కేంద్రంలో విద్యా శాఖకు సంబంధం లేని బయటి వ్యక్తిని వాటర్‌బాయ్‌గా నియమించడం వెనుక ఆంతర్యం ఏమిటనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టాల్సి ఉంది. అతని ద్వారానే ప్రశ్నప్రతం బయటకు వచ్చిందనే ఆరోపణలున్నాయి. అలాగే పలువురు ఇన్విజిలేటర్లు, సిబ్బంది సెల్‌ఫోన్లు కూడా లోనికి దర్జాగా తీసుకెళ్లారంటే పరీక్షల నిర్వహణ ఎంత లోపభూయిష్టంగా ఉందో తెలుస్తోంది. ఈ అన్ని అంశాలపై సమగ్ర దర్యాప్తు జరిపితే వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉంది.

టీచర్ల పీఎఫ్ స్లిప్‌లను వెబ్‌సైట్‌లో ఉంచాలి



జెడ్పీ డిప్యూటీ సీఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా జెడ్పీ, మండల పరిషత్ పాఠశాలలలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి సంబంధించిన ప్రావిడెంట్ ఫండ్ వార్షిక వివరాల స్లిప్‌లను వెబ్‌సైట్‌లో పొందుపరచాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదిరెడ్డి శ్యాం సుందర్ రెడ్డి కోరారు. ఈ విషయమై మంగళవారం కడప జెడ్పీలో డిప్యూటీ సీఈఓ మైథిలిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్, మండల పరిషత్ పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 2023–2024 సంవత్సరానికి చెందిన పీఎఫ్ స్లిప్‌లను వెబ్‌సైట్‌లో పొందుపరచాలని, పీఎఫ్ నెలవారీ జమలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ లో ఉంచాలని కోరారు.

పచ్చటి పందిరి





ఎండలు మండుతున్నాయి. ఎండ వేడికి ఎక్కడ చూసినా పచ్చదనం కరువవుతోంది. దీనికి భిన్నంగా పుష్పగిరి కంటి ఆసుపత్రిలో క్యాంటీన్ మొక్కలతో నిండి పచ్చదనాన్ని సంతరించుకుంది. ఇక్కడికి వచ్చిన రోగులు ఈ క్యాంటీన్‌లో సేదదీరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కడప